# గాలినీడ

"నమస్కారమండీ" అన్నాను.

సంతకాలు చేస్తున్న కాయితాల్లోంచి సాయిలక్ష్మి తల పయికెత్తలేదు. అద్దాల తలుపు తెరుచుకుని నేను ఆమె గదిలోకి ప్రవేశించేప్పుడు ఆమె నన్ను చూడడం నేను గమనించాను. నేను రావడం ఆమెకు ఇష్టం లేదని తెలుసు. వాళ్ళ బేంకుకు ప్రత్యేకంగా నా చెక్కుల విషయం రావడం అది నాలుగోసారి. ఆమె మేనేజరుగా పనిచేస్తోంది. ముప్పయి అయిదు సంవత్సరాలు పయినే ఉంటాయి. ఆమె నాకు ప్రతినమస్కారం చేస్తుందని ఎదురు చూడలేదు. మర్యాద కోసమయినా కూర్చోమంటుంది అనుకున్నాను. కూర్చోమనలేదు.

అర నిమిషంపాటు ఆమె బల్లకు ఎదురుగా నిలబడి బల్లమీద నా కారు తాళాలు, సెల్ పెట్టి కుర్చీ బల్ల దగ్గరగా లాక్కుని కూర్చున్నాను. ఆ వేళ నా సంగతి అటో ఇటో తేల్చుకుందామనే వచ్చాను. బల్లమీద నా మోచేతులు పెడుతోంటే తలెత్తి ఇబ్బందిగా నా ముఖంలోకి చూస్తూ, "చెప్పండి" అంది.

ఆమె నన్ను గుర్తు పట్టలేదో, గుర్తు లేనట్టు ప్రవర్తిస్తోందో నాకు అర్థం కావడం లేదు. నా డబ్బు గురించి నేను కాబట్టి ఇంతవరకు ఆగాను. మరొకరయి ఉంటే ఊరుకుని ఉండే వారుకాదు.

"నా ఇరవయి ఏడువేల డబ్బు సంగతి మాట్లాడదామని వచ్చాను" అన్నాను.

"ఏ ఇరవయి ఏడువేలు?" అడిగింది.

"అదేనండి. 'కేన్‌ఫిన్ హోమ్స్' కు ఇచ్చిన చెక్కుల గురించి... " అంటున్నాను. నా మాటలకు అడ్డొచ్చి, "మీరు... మీరు...." బాల్‌పెన్ ఉన్న చేత్తో నుదురు చిన్నగా కొట్టుకుని తెచ్చిపెట్టుకున్నట్టుగా నవ్వింది.

నా పేరు చెప్పాను.

"మీ పేరు గుర్తుంది. ఇదో మీరిచ్చిన వివరాలు ఉన్నాయి." అని బల్లమీదున్న అద్దం కింద నేను అంతకుముందు వచ్చినప్పుడు రాసిచ్చిన కాయితం చూపించింది.

బి.పి.కరుణాకర్

"ఏం చేశారు?" అడిగాను.

ఏం చెప్పాలో తెలియడం లేదు అనుకుంటాను. బల్లమీదున్న బెల్ కొట్టబోయేంతలో బంట్రోతు బల్ల దగ్గరకు వచ్చాడు.

నన్ను చూపించి, "సార్‌కు ఒక కాఫీ తెచ్చిపెట్టగలవా?" అంది.

"వద్దండీ. ఇప్పుడే తాగి వచ్చాను." అన్నాను.

బంట్రోతు అవుట్ ట్రేలో ఉన్న చెక్కులు, కాయితాలు తీసుకువెళ్ళాక, "చూశారుగా, ఈ సమయంలో పని వత్తిడి ఎక్కువగా ఉంటుంది. మీరేమీ అనుకోకపోతే సాయంత్రం అయిదు దాటిన తర్వాత రాకూడదూ?" అంది.

"రాను. ఈ విషయమయి రావడం ఇది నాలుగోసారి. ఫోను చేస్తే మీరు దొరకరు. దొరికినా నా మాటలు పూర్తిగా వినకుండా లయిన్ కట్ చేస్తారు. ఆ ఇరవయి ఏడువేలు నాకు పెద్ద మొత్తమేమీ కాదు. ఎవరికో దానం చేశానని అనుకుంటాను. లేదూ, ఎక్కడో పోయాయని అనుకుంటాను. పొరపాట్లు జరగడం సహజం. నాలా మరొకరు మోసపోకూడదనే ఉద్దేశంతో అసలు మోసం ఎలా జరిగిందో తెలుసుకుందామని వచ్చాను" కోపాన్ని తొక్కిపడుతూ నెమ్మదిగా అన్నాను.

ఆమె ముందుకు జరిగి, "ఈ సమయంలో ... " అంటోంటే ఫోను మోగింది. తీసుకోలేదు.

ఆమె ఏం అనబోతోందో నేను ఊహించగలను. తల అడ్డంగా ఆడించి, "నాలుగు నెలల కిందట వస్తే సాయంత్రం రమ్మన్నారు. వచ్చాను. నన్ను రమ్మనమన్న మీరు రెండున్నరకే బయటకు వెళ్ళిపోయారు. మంచిగా అనిపించలేదు. ఈ రోజూ అలా జరగొచ్చు కదా...?" అని తెచ్చిన ఫయిల్లోంచి అంబుట్స్‌మెన్‌కు రాసిన ఫిర్యాదు తీసి ఆమెకిచ్చి, "చదవండి" అన్నాను.

అందులో నేను 'కేన్‌ఫిన్ హోమ్స్' వాళ్ళకు ఇచ్చిన మూడు చెక్కుల్లో జరిగిన అవకతవకలు గురించి వివరించాను. అంబుట్స్‌మేన్ అంటే కేంద్రప్రభుత్వ బేంకులకు అవినీతి నిరోధక శాఖలాంటిది. ఏ కస్టమర్ నుండయినా ఫిర్యాదు వెళ్తే తీవ్రంగా పరిగణిస్తారు. అందులో నా పేరు, ఉద్యోగం, చిరునామా, నా సేవింగ్స్ బేంక్ ఎకౌంట్ నెంబరు వివరాలు ఇస్తూ నా ఇంటికయి కేన్‌ఫిన్ హోమ్స్ నుండి తీసుకున్న లోను తాలూకు ఇ.యం.ఐ. నెలకు 1099 రూపాయలు చెక్కుల ద్వారా కేన్ ఫిన్‌హోమ్స్‌కు పంపిస్తుంటే మూడు నెలలపాటు 1099 రూపాయలను 9099

రూపాయలు తీసుకున్నట్టు నా ఎకౌంటులో చూపించేసరికి ఎక్కడ పొరపాటు జరిగిందో తెలియలేదు. వడ్డీ పడకుండా 'కేన్‌ఫిన్ హోమ్స్' వాళ్ళకు వాయిదాలు డి.డి. పంపించి నా సమస్యను సాయిలక్ష్మి దృష్టికి తీసుకువెళ్ళిన సంగతి కూడా నా ఫిర్యాదులో పేర్కొన్నాను. చివరిగా ఏ సంగతీ విచారించి సంబంధిత అధికారుల మీద తగిన చర్య తీసుకొమ్మని, నాకు రావలసిన డబ్బును వడ్డీతో సహా చెల్లించాలని కోరాను.

నా ఫిర్యాదు చదివాక కూడా సాయిలక్ష్మి ముఖంలో ఏ భావం వ్యక్తం కాలేదు. ఫిర్యాదు నాకిచ్చేస్తూ, "ఇప్పుడు మాకు ఆడిట్ జరుగుతోంది." అంది నెమ్మదిగా.

"ముందొచ్చినప్పుడు కూడా ఒకసారి ఇదే సాకుచెప్పారు. పెయిడ్ చెక్కులు మీ ఆఫీసులోనే ఉంటాయి కదా, అవి తెప్పించి చూస్తే పొరపాటు నేను చేశానా? మీ బేంకు వాళ్ళు చేశారా? లేక బయటివాళ్ళ ప్రమేయం ఏమయినా ఉందో తెలుస్తుంది కదా?" నిరసనగానే అన్నాను.

ఆమె వెంటనే జవాబు చెప్పలేదు. నా వయిపు చూడకుండా తన పనేదో తను చేసుకుపోతోంది.

కుర్చీలోంచి లేచి, "అనవసరంగా మీ దగ్గరకు వస్తున్నాను. నా డబ్బులు ఎలా వసూలు చేసుకోవాలో నాకు తెలుసు" కోపంగా అన్నాను.

తలెత్తి, "కూర్చోండి పెయిడ్ చెక్కులు తెప్పిస్తాను" అంది. అని కళ్ళద్దాలు తీసి బల్లమీద పెట్టి బెల్ కొట్టింది. కూర్చున్నాను.

బంట్రోతు వస్తూ కొన్ని పేపర్లు తెచ్చి ఇన్‌ట్రేలో పెట్టి అవుట్ ట్రేలోని పేపర్లు తీసుకుంటూ, "పెద్ద అయ్యగారు మిమ్మల్ని ఒకసారి రమ్మన్నారమ్మా" అన్నాడు.

"పది నిమిషాల్లో వస్తానని చెప్పు. అర్జంటుగా ఈ మూడు నెలల పెయిడ్ చెక్ బండిల్స్ తీసుకువస్తావా?" అని అతనికి కాయితం ఇచ్చింది.

అతను వెళ్ళిపోయాక, "నాకీ సంవత్సరం ప్రమోషన్ ఉంది. నామీద ఏ చిన్ని ఆరోపణ వచ్చినా ప్రమోషన్ తొక్కి పెట్టేస్తారు" అంది.

నా చెక్కులు మీద తన మీద తనకు అపనమ్మకంగా ఉందా లేక ముందొకసారి నా పెయిడ్ చెక్కులు చూసిందా?

"ఈ ఫిర్యాదు మీ మీద కాదు. నా చెక్కుల గురించి మీతో మాట్లాడానని రాశాను."

ఆమె తల వంచుకుని ట్రేలో ఉన్న కాయితాలు అందుకుని ఒక్కొక్కటీ చూస్తూ ఎరుపురంగు బాల్‌పెన్ సంతకాలు చేస్తోంది. విసుగనిపిస్తుందనుకుంటాను. కొన్ని పూర్తిగా చదవకుండా సంతకాలు పెడుతోంది. ఈ సమయంలో పని వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఈ మధ్యలో రెండుసార్లు ఫోనుమోగింది. తీసుకోలేదు. సెల్ కూడా మోగింది. నెంబరు చూసి కట్టేసింది.

పావుగంట తర్వాతగాని రాజయ్య రాలేదు. మూడు కట్టలు ఆమె బల్ల మీద పెట్టి వెళ్ళబోతోంటే, "తేదీల ప్రకారం కాయితాలు పెట్టయ్యా" అంది విసుగ్గా.

"పెట్టానండీ" అని వెళ్ళిపోయాడు.

రాజయ్య పెయిడ్ చెక్కుల కట్టలు తెస్తాడని నేను అనుకోలేదు. తీసుకురానందుకు ఏదో సాకు చెబుతాడని అనుకున్నాను. తను చేస్తున్న పని పక్కన పెట్టి కట్టలు అందుకుంటోంటే నా మనసు తేలికయింది.

ఆమె ఒక్కో చెక్కు చూస్తోంటే ఆమె ముఖంలోకి చూడసాగాను. ఎటువంటి భావం వ్యక్తం కావడం లేదు. మూడు కట్టల్లోని చెక్కులు చూశాక, వాటిని నా ముందుకు నెట్టి, "చూడండి" అంది.

చూశాను. మూడు చెక్కుల్లోనూ మార్పులున్నాయి. కెమికల్‌తోనో, బ్లేడు ఉపయోగించే 'ఎకౌంట్ పేయీ' క్రాసింగ్‌తో సహా తీసేశారు. 'కేన్‌ఫిన్ హోమ్స్' ను 'కేన్‌బిన్‌హోమేష్'గా, 1099 రూపాయలను 9099 రూపాయలుగా అంకెలను, అక్షరాలను మార్చారు. నా సంతకం అలానే ఉంది. చెక్కు వెనక నా పేరు కూడా అలానే ఉంది. లోను ఎకౌంట్ నెంబరు తుడిపేసి ఉంది. చెక్కుల్లో మార్పులు కొట్టొచ్చినట్లు కనిపించే చోట నాకు మాదిరి సంతకాలు పెట్టారు. ఆ మూడూ బేరర్ చెక్కులు అయిపోయాయి. దీర్ఘంగా నిట్టూర్చి కట్టలు ఒక పక్కగా పెట్టి, "ఎవరు తీసుకుని ఉంటారు?" అడిగాను.

"ఏమో".

"ఆథరయిజేషన్ సంకతాలు మీవే అనుకుంటాను".

"రోజుకు వందలకొద్దీ సంతకాలు పెడుతుంటాను. ఎక్కడో పొరపాటు జరిగింది. ఎవరు తీసుకుని ఉంటారో తెలుసుకోవడం కష్టం." అంది.

"మీ కింది పనిచేసేవాళ్ళ సహకారం లేకపోతే ఈ చెక్కులు చెల్లించబడి ఉండేవి కావు."

"ఎవరినని అనుమానించడం?" భుజాలు పయికి కదిపి నా ముఖంలోకి నిస్సహాయంగా చూసింది.

"నా డబ్బులు నాకు రావాలంటే నేనేం చేయాలి?".

"అవి నా సంతకాలు కాబట్టి ఆ బాధ్యత నేను తీసుకుంటాను. మీ డబ్బులు నేనిస్తాను. కాకపోతే ఇప్పుడిప్పుడు ఇవ్వమంటే నేను ఇవ్వలేను. నాకు మూడు వారాల సమయం ఇవ్వండి. నామీద నమ్మకం లేకపోతే మీరు మా సీనియరు మేనేజరు దగ్గరకు వెళ్ళొచ్చు. అదో శాడిస్టు మేళం. ఈ సమస్యను జటిలం చేస్తాడు. నన్ను వేధించడానికి మీరు అవకాశం ఇచ్చిన వాళ్ళవుతారు..." ఆగి కుర్చీ వెనక తువ్వాలు అందుకుని ముఖం తుడుచుకుని, "మూడు వారాల్లోగా మీ డబ్బులు మీకు అందకపోతే మీ ఫిర్యాదు 'అంబుట్స్‌మెన్'కు ఇచ్చేయవచ్చు. నాఖర్మ అనుకుంటాను" అంది దీనంగా.

చివరి మాటతో ఆమె మీద జాలివేసింది. లేచి నా విజిటింగ్ కార్డు ఆమెకిచ్చి, "అసలు దోషి ఎవరో కనుక్కోగలిగితే నాకు తెలియజేస్తే సంతోషిస్తాను" అని కారు తాళాలు, సెల్ తీసుకుని వెళ్తున్నట్టు తలూపి బయటకు వచ్చాను.

పదిరోజుల తర్వాత నాకు ఫోను చేసి, "మీకో మంచి వార్త"అంది.

"చెప్పండి."

"దొంగ దొరికాడు."

"ఎవరు?"

"జనరల్ పోస్టాఫీసులో పనిచేస్తున్న రాంపండు అనే అతను ఈ పనులు చేశాడు. మీరు చెక్కులు పెట్టి 'కేన్‌ఫిన్ హోమ్స్' కు పంపించే కవర్లు 'కేన్‌ఫిన్ హోమ్స్'కు వెళ్ళనీకుండా ఆపి మార్పులు చేసి మా బేంకుకు వచ్చి 'కేన్‌బిన్ హోమేష్' అని వ్యక్తిపేర డబ్బులు తీసుకున్నాడు."

"అదెలా తెలిసింది?"

"ఐ.సి.ఐ.సి.ఐ. బేంకులో కూడా ఇలానే చేస్తే వాళ్ళు పోలీసు కంప్లయింట్ ఇస్తే దొరికాడు. రాంపండును పోలీసులు కస్టడీలోకి తీసుకుని కూపీలాగితే మీ చెక్కుల సంగతి కూడా బయటపడింది. ఈ వేళే పోలీసులు మాకు ఫోను చేసి చెప్పారు."

"రాంపండును ఏం చేశారు?"

"ఏం చేసినట్టు లేదు."

"తీసుకున్న డబ్బు తిరిగిచ్చేశాడా?"

"తిరిగిస్తానని పోలీసులకు రాసిచ్చాడట. అంచేత వదిలి పెట్టేసినట్టుంది."

"అదేమిటి?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"పోలీసు కస్టడీలో ప్రభుత్వ ఉద్యోగి నలబయి ఎనిమిది గంటలపాటు ఉంటే సస్పెండ్ చేస్తారని వాళ్ళ యూనియన్ పెద్దలు వచ్చి వత్తిడి చేసేసరికి పోలీసువాళ్ళు కాదనలేకపోయారట."

"మీ బేంకు నుండి మీరేమీ ఫిర్యాదు ఇవ్వలేదా?"

"ఇవ్వలేదు. ఇస్తే మా స్టాఫ్‌లో మాకు ఎవరి మీద అనుమానం ఉందో సూచించాలి. అలా చేస్తే లేనిపోని గొడవలు మొదలవుతాయి. బేంకు స్టాఫ్ యూనియన్ తపాలా శాఖ యూనియన్ అంత గట్టిది. ఆధారం చూపించకపోతే నరకమే అనుకోండి. తట్టుకోవడం నా వలన కాదు."

"రాంపండు డబ్బులు తిరిగి మీకిచ్చే వరకు నా డబ్బులు ఇవ్వరా నాకు?"

"అదేం కాదు. మీ డబ్బులు నేను మీకిస్తాను. వచ్చే సోమవారం ఉదయం పదకొండింటికి మా బేంకుకు వచ్చి డబ్బులు తీసుకు వెళ్ళండి. 'అంబుట్స్‌మెన్' వాళ్ళకు ఫిర్యాదు చేశారా?"

"చేయలేదు." నేనేదో అడగబోతోంటే, "ఉంటాను." అని ఫోను పెట్టేసింది.

నా అనుమానాలు అలానే ఉండి పోయాయి.

మరుసటి సోమవారం ఆమె చెప్పిన సమయానికి పదినిమిషాలకు ముందే బేంకుకు చేరి ఆమె గదిలో కూర్చున్నాను. కారు తాళాలు, సెల్ బల్ల మీద పెట్టాను. అయిదు నిమిషాల తర్వాత సాయిలక్ష్మి గదిలోకి వస్తూ, "ఎంతసేపయింది మీరొచ్చి?" అడిగింది. తన కుర్చీలో కూర్చుంటోంటే చెప్పాను. బల్ల సొరుగులోంచి డబ్బుల కట్ట తీసి నా ముందుంచి, "ఇరవయి ఏడువేల మూడొందలు. లెక్క పెట్టుకోండి" అంది.

"పరవాలేదు".

"మీకొక్క విషయం చెప్పి వెళ్ళిపోతాను. జనరల్ పోస్టాఫీసులోని అడ్మినిస్ట్రేటివ్ బ్రాంచిలో యాదగిరి అని నా స్నేహితుడు సూపరింటెంటుగా పని చేస్తున్నాడు. మీరు రాంపండు గురించి చెప్పినప్పుడు యాదగిరికి చెప్పి రాంపండు గురించి తెలుసుకొమ్మని అడిగితే యాదగిరి ఏమన్నాడో తెలుసా? రాంపండు పేరు గల వ్యక్తి

తమ ఆఫీసులోగాని, ఏ సార్టింగ్, బట్వాడా ఆఫీసుల్లో గాని పనిచేయడం లేదని చెప్పాడు.”

ఆమె ఎర్రటి ముఖం నా మాటలకు మరింత ఎరుపెక్కింది. కళ్ళద్దాలు తీసి బల్లమీద పెట్టి నా ముఖంలోకి సీరియస్‌గా చూస్తూ ఏదో అనబోతోంటే, “పోలీసులు అతన్నో, మరెవరినో నిజంగా అదుపులోకి తీసుకుని ఉంటే నిజానిజాలు తెలుసుకోడానికి నాకూ కబురు పెట్టేవాళ్ళు కదా. కాదా?” అడిగాను.

ఆమె జవాబుకయి ఎదురు చూడకుండా లేచి డబ్బులు పంట్లాం జేబులో పెట్టుకున్నాను. అన్ని అబద్ధాలు ఆడుతున్న మనిషికి కృతజ్ఞతలు చెప్పాలనిపించలేదు. గది బయటకు వచ్చాను.

బేంకు ఆవరణలో ఒక మూల ఉన్న చెట్టుకింద నిలబడి సిగరెట్ వెలిగించాను. కావాలనే రెండు నిజాలను ఆమె ముందుంచాను. నా కారు తాళాలు, సెల్ ఆమె బల్లమీద ఉంచాను, మర్చిపోయి కాదు. సెల్‌ను ఆన్‌లోనే ఉంచాను. నిజానికి అది సెల్ కాదు. సెల్‌లా కనిపించే టేప్ రికార్డరు. మరిన్ని వివరాలు దొరుకుతా యనుకుంటున్నాను. వాళ్ళ ఆడిట్ దృష్టికి అందకుండా బేంకుల్లో అవకతవకలు జరగవని కాదు. చాలా జరుగుతుంటాయి. అయితే బయటకు రావు. పెద్ద మొత్తాలలో అప్పుతీసుకున్న వాళ్ళ వడ్డీ కట్టడం విషయంలో, చాలా కాలంగా ముట్టని ఖాతాలు విషయంలో, ప్రాజెక్టులు, లోన్లు పెద్ద మొత్తాలలో శాంక్షన్ చేసే విషయంలో, ఇంట్లో ఎవరికీ తెలియకుండా ఫిక్సడ్‌లో వేసి సరయిన చిరునామా, నామినేషన్ ఇవ్వకుండా లేక కావాలని తప్పు ఇచ్చి కాలం చేసే వృద్ధుల విషయంలో, వన్‌టయిం సెటిల్‌మెంట్ విషయాల్లో జరగకూడనివి జరుగుతూ ఉంటాయి. అన్ని చోట్లా జరుగుతుంటాయని కాదు. జరుగుతున్న చోట్ల ఒక్కరి వలన కాదు. ఇద్దరి ముగ్గురి చేతులుంటాయి. స్టాఫ్‌కు బదిలీలు జరుగుతున్నా కొనసాగుతూనే ఉంటాయి.

నా విషయంలో సాయిలక్ష్మి ఒకతే చేసే అవకాశం లేదు. ఎవరి సహాయమో తీసుకుని ఉండాలి. డబ్బు తీసుకుని నేనామె గదిలోంచి బయట పడిన వెంటనే ఆ వ్యక్తితో తప్పకుండా మాట్లాడుతుంది. నాకు కావలసినవి ఆమె మాటలు.

పావుగంట తర్వాత బేంకులోకి వచ్చి సాయిలక్ష్మి గది తలపు దగ్గర నిలబడి అద్దంలోంచి లోపలికి చూశాను. ఎవరితోనో ఫోనులో మాట్లాడుతున్నదల్లా మాట్లాడడం హఠాత్తుగా ఆపేసి ఫోను పెట్టేసింది.

తలుపు నెట్టి ఆమె గదిలోకి వెళ్ళి బల్లమీదున్న కారు తాళాలు, సెల్ తీసుకున్నాను. ఆమె ముఖంలోకి చూడలేదు. ఆమె నాతో మాట్లాడలేదు.

నెమ్మదిగా బయటకు వచ్చి నా కారులో కూర్చుని టేప్ రీవైండ్ చేసి మొదటినుండి వినడం మొదలెట్టాను. ఆమె గొంతుకు ఉచ్చుపడే మాటలు చాలా ఉన్నాయి. ఒక చోట నా గురించి చెబుతూ, "వీడు జిడ్డులా పట్టుకుని నన్ను వదలకుంటే ఎలా తప్పించుకునేది? ఏ గొడవా కాకుండా ఉండేందుకు వాడి డబ్బు వాడి ముఖాన కొట్టాను.... పోతురాజు, రామానుజయ్య, కాంతారావు, మాణిక్యరావు పోయారు కాబట్టి మనం బతికిపోయాం. లేకుంటే అక్కడా డబ్బులు కక్కాల్సి వచ్చేది... అదిసరేకాని, విజయవాడ అజాద్ స్థలం డీల్ ఏమయింది?..." మాటలు నడుస్తున్నాయి. పోతురాజు తదితరులు నాలాటి వాళ్ళు అయి ఉంటారు. సాయిలక్ష్మి దురదృష్టం కొద్దీ నేను బతికున్నాను.

* ఆదివారం వార్త, 7 నవంబరు 2010